# 38. రచయిత గారూ ఈకథకు ముగింపు మీరే రాయండి

శాస్త్రి గారి అమ్మాయికి పెళ్ళి నిశ్చయమైంది.

ముహూర్తం ఒక నాలుగు రోజులే ఉంది. అమ్మాయికి సంబంధం కుదిరితే తిరుపతి కొండ మీద పెళ్లి చేస్తానని శాస్త్రిగారి భార్య మొక్కుకుంది. శాస్త్రిగారి పెద్దబ్బాయి నెల్లాళ్ళకింద తిరుపతి వెళ్ళి సత్రవు, పురోహితుడు, వంటబ్రాహ్మడు మొదలైన వాళ్ళనందరిని కుదిర్చి, అయిదువేల వలకు అడ్వాన్సులిచ్చి వచ్చాడు. హైదరాబాదు నుండి మగపెళ్ళివారు వస్తారు. పెళ్ళయిన రెండో రోజు వాళ్ళకి తిరుగు ప్రయాణానికి టిక్కట్లు కూడా కొని రిజర్వేషన్లు చేయించాడు.

పెళ్ళికొడుకు పెళ్ళి కూతురిని చూసుకోవడానికి వచ్చినప్పుడు, ఒక అరగంట సేపు ఆమెతో మాట్లాడి తన సంగతంతా చెప్పాడు. తన ఉద్యోగం సంగతి, స్నేహితుల గురించి, తన ఆదాయం గురించి వివరంగా చెప్పాడు. పెళ్లి తరువాత అన్ని తాళాలు యిల్లాలి చేతికి మారుతాయని అతను అభయ మిచ్చాడు.

పెళ్లి కూతురు ఏ కోరికలు కోరలేదు. ముప్ఫై అయెదేళ్ళు దాటిపోతున్నాయి. ఎన్నో సంబంధాలు చూసి చూసి శాస్త్రిగారు, అతని పెద్దబ్బాయి విసిగిపోయారు. కొన్ని వేల రూపాయలు ఇంతవరకు ఖర్చు పెట్టారు.

ఇందులో నాకు కూడా కొంత భాగముంది.

పెళ్ళికొడుకు నాకు బాగా తెలుసు. కొంచెం దూరపు బంధువు. మనిషి అందంగా ఉంటాడు. బంధుప్రీతి గలవాడు. అన్నిటికన్న ముఖ్యంగా హైదరాబాదు సివారులలో మంచి యిల్లు కట్టించుకున్నాడు - మరో రెండు ఫ్లాట్లు కూడా నగరంలో కొనుక్కున్నాడు. ఇళ్ళ అద్దెలే నెలకు అయిదు వేల వరకు వస్తాయి.

చాలా కాలం బట్టి బ్రహ్మచారిగా బ్రతుకుతున్నాడు. ఇంట్లో తనది అన్న ఒక ఆడది. దీపం వెలిగించి, తను ఉద్యోగం నుంచి వచ్చినా, కాంపు నుండి మరలినా ఎదురుచూసి ఆదరిస్తే చాలు నన్నాడు.

శాస్త్రిగారి అమ్మాయి ఇంటి పనులు చక్కగా చేసుకోగలదు. ఏలోటూ లేకుండా పెరిగింది. మనిషి అంత అందగత్తె కాకపోయినా చాల గుణవంతురాలు.

ఈ విషయాలన్నీ పెళ్ళికొడుక్కు ముందుగా నేను వ్రాశాను. నా మాటకు గౌరవముంచి అతను వచ్చి పెళ్లికూతుర్ని చూసుకున్నాడు. ఆడ పెళ్ళివారి షరతులకు ఒప్పుకున్నాడు. తనకు బంధువులకన్న స్నేహితులే హెచ్చని, అటువంటి వాళ్ళనో ముగ్గురిని మాత్రం తనతో పెళ్ళికి తెస్తున్నానని అతను శాస్త్రిగారికి ముందుగానే తెలియజేశాడు.

పెళ్ళికొడుక్కి నలభై అయిదు సంవత్సరాలున్నాయి. ఇప్పటికీ అతను చాల అందంగానే ఉన్నాడు. అన్నీ మంచి సంగతులే ఉండవు కదా! చంద్రుడికో చిన్న మచ్చలా అతనికి కూడా ఒక లోపం ఉంది. రమారమి పదిహేను సంవత్సరాల కింద అతను భార్యకు విడాకులిచ్చాడు. ఆవిడమానాన్న ఆవిడ ఉద్యోగం చేసుకొని బ్రతుకు తున్నది. అతనికో యిద్దరు పిల్లలున్నారు. వాళ్ళు పెద్దవాళ్లయారు - మరే యిబ్బందులు లేవు.

శాస్త్రిగారి పెద్దకొడుకు పెళ్లి కొడుకు యింటికి వెళ్ళి వచ్చాడు. ఇల్లు బోసిగా ఉంది. ఒక పెద్ద అలమరా ఒక గదిలో ఉంది. ఎవరేనా స్త్రీ యింట్లో తిరుగుతుంటే ఇంటికి కళ వస్తుందని ఆయన చెప్పాడు.

శాస్త్రిగారు అన్నిటికీ ఒప్పుకున్నారు -

కన్నెచెర - ముప్ఫై అయిదేళ్ళ మనిషి కన్య ఏమిటి? - కూతురిని విడిపిస్తే చాలునని ఆయన తలవంచారు.

అన్నీ సిద్ధమయ్యాయి.

ఆమరునాడే ఆడపెళ్ళి వారు, వాళ్ళ తోపాటు మా దంపతులం బయలు దేరడానికి సన్నాహాలు పూర్తిచేసుకున్నాము.

ఆవేళ సాయంకాలం పోస్టులో ఒక ఉత్తరం వచ్చింది ఇన్‌లాండ్ లెటరది - వెనుక చిరునామా లేదు. హైదరాబాదు జనరల్ పోస్టాఫీసు ముద్రఉంది. ఆ ఉత్తరం చదువుతుంటే నాకు ముచ్చెమటలు పోశాయి. ప్రపంచం మునిగిపోతున్నంత పని అయింది. కాళ్ళు చేతులు ఆడలేదు.

ఏం చేయడం?

పావుగంట పచారు చేశాను.

శాస్త్రిగారికి ఈవిషయం తెలియజేయాలి.

బట్టలు వేసుకొని వాళ్ళింటికి బయలు దేరాను పక్క వీధిలోనే వాళ్ళిల్లు.

నేను వెళ్ళేసరికి శాస్త్రిగారు లేరు. పనిమీద ఎక్కడికో వెళ్ళారు.

ఇంట్లో చాలా సందడిగా ఉంది. శాస్త్రిగారి అమ్మాయి బి.యిడి. పాసయి టీచరుగా పని చేస్తున్నది. కొంతమంది లేడీ టీచర్లు వచ్చి హాలులో కూర్చొని కాఫీ ఫలహారాలు సేవిస్తున్నారు. కొండమీద, పెళ్ళికూతుర్ని చేసినప్పుడు కట్టించమని కంచిపట్టుచీర తెచ్చారు. ఇంట్లో

ఆందోళ్సాహాలు తాండవమాడుతున్నాయి. పెళ్లికూతురి ముఖంలో కళ వచ్చింది. ఇల్లు సున్నాలు వేసి, గుమ్మాలకు రంగులు రాసి, తోరణాలు కట్టి కనులపండువుగా వుంది.

ఈ ఉత్తరం సంగతి ఎలా చెప్పడం?

మరొక్క పది నిమిషాలలో శాస్త్రిగారు వచ్చారు. కొంచెం వయసులో పెద్దవారేమో, బాగా పనులతో బడలిపోయారు. ఆయనకీ సంగతి చెప్పే ముందు చాలా జాగ్రత్తలు తీసుకోవలసి వచ్చింది.

నాముఖంలో కనిపించే ఆందోళన ముందుగా కప్పవలసి వచ్చింది. నవ్వుతూ ఆయనని పలకరించాను - పెళ్లిపనుల గురించి అడిగాను. ఆయనతోపాటు కాఫీ తాగి, లోకం గురించి ఒక పావుగంట మాట్లాడి, ఆయన విముఖంగా ఉన్నా,నాతో పార్కువరకు నిడిపించాను.

పార్కులో ఇద్దరం ఒక బెంచి మీద కూర్చున్న తరువాత ఆయనతో చెప్పాను.

"శాస్త్రిగారూ! నాకు సాయంకాలం పోస్టులో ఒక ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం మీకు వ్రాయకుండా, నాకు వ్రాసి చాలా మంచి పనిచేశారు" అన్నాను.

"ఇంతకీ ఏమిటీ ఉత్తరం?" అతను ప్రశ్నించారు.

"మీకు చెప్పే ఉంటాను. పెళ్ళికొడుక్కి ఒక కూతురు. ఒక కొడుకు ఉన్నారని. వాళ్లు పెద్దవాళ్లయ్యారని, కూతురుకి పెళ్ళి చేసి పంపితే, కుర్రాడు పెద్ద చదువులకు వెళ్ళిపోతే ఎటువంటి యిబ్బంది ఉండదని చెప్పాను. మీ అబ్బాయి వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఎవరూ లేరు."

"అవును."

"నేను పెళ్ళికొడుకు ఒంటరివాడని, జీవితంలో అతనికింకా సంగం భాగం గడపవలసి ఉంటుందని, బ్రహ్మచర్యం గడపడం కన్న భార్యతో హాయిగా జీవితం గడపవచ్చునని, చాలా ముందాలోచనలకు పోయాను. నాకతను పిల్లల గురించి రేఖామాత్రంగా చెప్తే పట్టించు కోలేదు."

"అవునవును"

"ఇప్పుడు వాళ్ళొక ఉత్తరం వ్రాశారు."

"చదవండి"

"ఈ విషయం మనం చాల జాగ్రత్తగా పరిశీలించాలి. దీనిలోని విషయాలు నలుగురికి తెలిస్తే నవ్వులపాలవుతాం. మరేదో కారణం చెప్పి....."

"చెప్పండి! మరేం పరవాలేదు - జీవితంలో చాలా దెబ్బలు తిన్నాను. అన్నిటికీ అలవాటు పడ్డవాడినే......"

"ఉత్తరం వినండి."

గౌరవనీయులైన రచయిత గారూ,

మీరు చాలా కథలూ, నవలలూ రాశారు. మీరు చాల విషయాలు తెలుసుకొని, ఆలోచించి మరీ రచనలు చేస్తారు. మీరు ఊహాలోకంలో విహరిస్తారు - వాస్తవిక ప్రపంచం గురించి మీరు మరిచిపోయారు.

మీకు తెలుసు - పదిహేను సంవత్సరాలయి మానాన్నగారే మాకు తల్లిగా, తండ్రిగా మమ్మల్ని పెంచిపెద్దచేశారు - మాకేలోటు లేకుండా చూసుకున్నారు. ఆయన వాత్సల్యమనండి, ప్రేమ అనండి, మా గురించే వినియోగించారు.

మీకు బాగా తెలుసు - వివాహమైన తరువాత ఆయన ప్రేమను పంచుకోడానికి మరొకామె గృహప్రవేశం చేస్తుంది. ఈ వయసులో దొరికిన పెళ్ళాంతో ఆయన పూర్తిగా పరవశులౌతారనడం సహజమే.

మాకింతవరకూ దేవతగా వర్తించిన మా ప్రియమైన తండ్రి మానుంచి దూరమవుతారు.

ఈ సంగతి తలచుకుంటేనే మాకు భరించరాని దుఃఖం కలుగుతున్నది. తండ్రి ప్రేమను పోగట్టుకున్న మేము బ్రతికున్నా లాభం లేదు.

నేను మా తమ్ముడు ఒక నిశ్చయానికి వచ్చాము.

మానాన్నగారు కొత్త పెళ్ళానికి తాళికట్టే సుముహూర్తానికే మేమిద్దరం మాయింట్లో ఉరిపోసుకొని చచ్చిపోతాం.

మానాన్న గారికి పెళ్ళిచేసి ఆనందిస్తారా?

మా గురించి అశ్రువొకటి విడిచి విచారిస్తారా?

రాచయితగారూ! ఈ కథకు మీరు ముగింపు రాయండి."

చెప్పడానికి మరేంలేదు -

పెళ్ళి ఆగిపోయింది.

ఇక్కడితో కథ ఆపేస్తే బాగుంటుంది.

దీని వెనుక ఎవరి ప్రచ్ఛన్న హస్తముందో నాకు అంతుపట్టలేదు -

కొన్నాళ్ళ తరువాత ఒక కాలేజీ సాహిత్య సభలో నన్ను ముఖ్య అతిథిగా పిలిచారు - - కాలేజి లెక్చరరు ఒక ఆమె నన్ను సభకు పరిచయం చేసింది. తరువాత నేను అరగంట సేపు కథానిక మీద మాట్లాడాను. మొపాసా కథ నొకదానిని ఉదాహరించాను.

అతను చాల మంచివాడు - డబ్బుగలవాడు - పెళ్ళాన్నీ, పెళ్ళాం కన్న హెచ్చుగా ఆమె కన్నటువంటి కొడుకునూ ప్రేమించాడు - కుర్రాడితోనే లోకమనుకున్నాడు. పెళ్లాం అతని స్నేహితుడితో తిరుగుతున్నాదని అందరూ అన్నా పట్టించుకోడు. ఒక రాత్రి ఆమె ఎంతకీ

యింటికి తిరిగి రాదు. ఇంట్లో వంటలక్క దగ్గరినుంచీ అతని భార్య ప్రవర్తన గురించి అంటే భరించలేకపోతాడు. పెళ్లాం యింటికి వచ్చిన తరువాత వంటలక్కకు ఉద్వాస మిచ్చినట్లు. ఆమె అన్న మాటలు తను నమ్మనట్లు చెప్తాడు.

ఆ మంటిబుక్కడంవంటి మొగుడికి జ్ఞానోదయం కలగడం ఆమె సహించలేకపోయింది. ఆ అమాయకుడిని, ఆ దీనుడిని, ఆ పెద్దమనిషిని, బతికున్నంత కాలం సుఖం లేకుండా, మానసిక సంక్షోభానికి గురిచేస్తూ, కసిగా ఆమె ఒక మాటంటుంది."

ప్రసంగం ఒక్కక్షణం ఆపాను. గ్లాసులో నీరు తాగడానికి -

మొదటి వరుసలో కూర్చున్న లెక్చరరు, నన్ను పరిచయం చేసిన ఆమె,లేచి వెళ్లిపోతున్నది.

అప్పుడు నాకు ఉత్తరంలోని కథకు ముగింపు తెలిసింది.

రచన - మాసపత్రిక

☆